క్లుప్తంగా

రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని రసూల్‌పల్లె నుంచి గంగన్నపల్లెకు వెళ్ళే రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో రసూల్‌పల్లె నుంచి గంగన్నపల్లెకు రోడ్డు కావాలని ప్రజలుకోరగా స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో పనులను ప్రారంభించారు. దీంతో గ్రామంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా పంపిణీ



బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఆర్డర్ కాపీని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మున్సిపాలిటీ కార్యాలయంలో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆర్డర్ కాపీని బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అందించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సెప్టిక్ ట్యాంక్‌ను ప్రారంభించి అనంతరం అర్బన్ హెల్త్‌క్లబ్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మూలే హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

చింతకొమ్మదిన్నె : నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సుధాకర్‌రెడ్డి తెలిపారు. రక్తదానం ఇచ్చిన దాత శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గి రక్తపోటు నియంత్రణలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ రమేష్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయ కర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ల భవనాలకు జరుగుతున్న పనులు

సింహాద్రిపురం : మండలంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శరవేగంగా చేపడుతోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.200 కోట్లకు పైగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన శాశ్వత ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ బస్టాండు, డ్రైనేజీ వ్యవస్థ, వైఎస్సార్ పార్కుతోపాటు వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు దాదాపు 80 శాతం పనులు పూర్తి కాగా.. మిగతా పనులు పూర్తికి అధికారులు అహర్నిశలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెలాఖరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

దీనబంధు ఆశ్రమానికి నగదు వితరణ



వికలాంగ సేవకుడు జనార్ధన్‌రెడ్డితో వైఎస్ రవీంద్రారెడ్డి

పులివెందుల టౌన్ : దీనబంధు ఆశ్రమానికి మహానేత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు వైఎస్ రవీంద్రారెడ్డి బుధవారం రూ.25వేల నగదును అందజేశారు. స్థానిక రమణప్ప సత్రం బడి పాఠశాల ఆవరణలో వికలాంగుల సేవకుడు, ఆశ్రమ నిర్వాహకుడు జనార్ధన్‌రెడ్డికి వైఎస్ రవీంద్రారెడ్డి రూ.25వేల నగదును అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనార్ధన్‌రెడ్డి వికలాంగుడైనప్పటికి తోటి వికలాంగులకు మనోధైర్యం నింపుతూ వారి సేవ కోసం తపిస్తుంటారన్నారు. దీనబంధు ఆశ్రమానికి తన వంతు సాయం అందిస్తున్నానన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

పెద్దముడియం : ఈ సారి కుందూనదిలో సాగు నీరు పుష్కలంగా ఉండటంతో నదీపరీవాహక గ్రామాలైన నెమళ్లదిన్నె, గరిశలూరు, బలపనగూడూరు గ్రామాల ప్రజలు వరి పంటను సాగు చేశారు. కొద్దిరోజుల క్రితం మిచాంగ్ తుఫాన్ కారణంగా కోతలను వాయిదా వేసుకున్నారు. ధాన్యం తడిసిపోతుందని ముందస్తు కోతలు కోయలేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో యంత్రాలతో వరి పంటను కోస్తున్నారు. వడ్లు ఎకరానికి 40 బస్తాలు(75 కేజీలు)దిగుబడి వస్తుండగా, బస్తా ధర రూ.1800 నుంచి రూ.2200 వరకు పలుకుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కుందూ నది ఒడ్డున జోరుగా వరి కోతలు



వడ్లను ఆరబెట్టిన రైతు



తూకం వేస్తున్న కూలీలు

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

వల్లూరు : రైతులు, మహిళలు, గ్రామీణ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ఏర్పాటు చేసిన డీసీసీ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప జీఆర్‌ఆర్ స్ట్రీట్ బ్రాంచ్ మేనేజర్ పీ ఆంజనేయులురెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దపుత్త గంగమ్మ ఆలయ ప్రాంగణంలో వల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత, సాంకేతికతపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ బ్యాంకులో 15 సంవత్సరాల పిల్లలకు కిడ్స్ పొదుపు ఖాతాలు, కిడ్స్ రికరింగ్ డిపాజిట్ ఖాతాలు, కిడ్స్ డిపాటిజిట్ ఖాతాలను తెరవడం జరుగుతుందని తెలిపారు. వీటి వలన పిల్లల్లో చిన్న వయసు నుండే పొదుపుతో పాటు బ్యాంకింగ్ గురించి అవగాహన పెంపొందుతుందన్నారు. పిల్లల పొదుపు ఖాతాలోని సొమ్ముపై 7 శాతం వడ్డీ ఇస్తారన్నారు. ఈ బ్యాంక్‌లో బీమా సౌకర్యం, ఏటీఎం సౌకర్యం అందుబాటులో వుందన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు మేనేజర్

రైతులు, మహిళా సంఘాలకు, చిరు వ్యాపారులకు, పశు పోషకులకు, గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణాలకు రుణాలు ఇస్తారన్నారు. వల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జనవరి మాసం నుంచి గోల్డ్ లోన్ సౌకర్యం అందుబాటులోకి రానుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో రామచంద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో సీవో సుబ్బారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాసులురెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

పులివెందుల టౌన్ : దేశ వ్యాప్తంగా గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు తమ సమస్యల డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బుధవారం స్థానిక తపాల శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు కె.సి.రాముడు ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు తమ 8 ప్రధాన న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రతి జీడీఎస్‌కి సివిల్ సర్వెంట్ హోదా కల్పించి 8 గంటల పనిభారాన్ని కల్పించాలన్నారు. సీనియర్ జీడీఎస్‌లకు సర్వీస్ పూర్తయిన వారికి అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి, అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాంట్యుటీని



నిరసన తెలుపుతున్న గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు

రూ.5 లక్షలకు పెంచాలన్నారు. ఎస్‌డీబీఎస్, జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం మరియు డిపార్ట్‌మెంట్ 10 శాతంగా నిర్ధారించి తాత్కాలిక పెన్షన్ ఇవ్వాలన్నారు. రెగ్యులర్ జీడీఎస్‌లు పెట్టినప్పుడు వర్క్ లోడుతో సంబంధం లేకుండా సబ్‌స్టిట్యూట్‌ని అనుమతించాలన్నారు. కమిటీలో అమలు కానీ అన్ని అంశాలను అమలు చేయాలన్నారు.

శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న బుడ్డ శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ఇందుకూరు రైతు భరోసా కేంద్ర పరిధిలో సాగు చేసిన బుడ్డ శనగ పంటను పరిశీలించి మాట్లాడారు. శనగ పంటలో పొగాకు లద్దె పురుగు మరియు రబ్బరు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ పురుగు కాండంను తుంచి నష్టం కలిగిస్తుందని దీని నివారణకు నోవాల్యురాన్ మరియు ఇండాక్సా కార్బన్‌ను లీటరు నీటికి 1.5 ఎంఎల్, లేదా టెట్రానిలిపోల్ 0.5 ఎంఎల్ లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. ప్రస్తుతం వాతావరణానికి మినుము, పెసర, నువ్వుల పంటలో బూడిద



బుడ్డశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి

తెగులు సోకే అవకాశం ఉన్నందున నివారణకు మైక్లోబుటానిల్ లీటరు నీటికి 1మిల్లీ లీటరు కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు వాణి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

వేంపల్లె : స్థానిక జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు దృష్టి లోపాన్ని గుర్తించి వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి చేతులమీదుగా 80 మంది విద్యార్థులకు కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతిసాయి మాట్లాడుతూ కంటి సమస్యలు కొద్దిగా ఉన్నప్పుడే పరీక్షలు చేసుకుని తద్వారా అద్దాలు కానీ, ఆపరేషన్ కానీ చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా లభించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వైద్యులు రెడ్డప్ప మాట్లాడుతూ కన్ను మనకు ముఖ్యమైన అవయవం కనుక



విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఓ ఎస్.ఫకృద్దీన్, హెడ్మాస్టర్ నాగమునెమ్మ, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గంగనపల్లె విద్యార్థులు

కడప స్పోర్ట్స్ : పెండ్లిమర్రి మండల పరిధిలోని గంగనపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఏపీ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎస్. ఫౌజియా అండర్-14 పోల్‌వాల్ట్ బాలికల విభాగంలో 2.10 మీటర్ల ఎత్తు దూకి ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. అదే విధంగా వి. మోసిన 1.70 మీటర్ల ఎత్తు దూకి రెండోస్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. దీంతోపాటు జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు వీరు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి. శివశంకర్‌రెడ్డి తెలిపారు.



ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు

జగనన్నకు చెబుదాంతో సమస్యలు పరిష్కారం

పెద్దముడియం : స్థానిక మండల కార్యాలయం వద్ద ఈనెల 15న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుందని, దీని ద్వారా ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డితో పాటు అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. మండల పరిధిలోని ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : 11 కె.వి. బెస్తవారిపల్లె ఫీడర్, 11కె.వి. ఇండస్ట్రియల్ ఫీడర్ కడప రోడ్డు నుంచి గురుకుల పాఠశాల, మెడికల్ కళాశాల ప్రాంతాలలో కొత్త విద్యుత్ లైన్ వేస్తుండటంతో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండులో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటలవరకు 9959225780 అనే ఫోన్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా ప్రయాణీకులు తమ సమస్యలను మెసేజ్ రూపంలో తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లింగ వివక్ష రూపు మాపాలి

వేంపల్లె : మహిళ సాధికారిత సాధించినప్పుడే లింగ వివక్ష రూపుమాపినట్లు అని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మిదేవి ఆధ్వర్యంలో లింగ వివక్షతపై విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్షత కొనసాగడానికి సమాజంలో మహిళలపట్ల చూపుతున్న సవతి ప్రేమే అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సెల్ మెంబర్స్ మల్లేశ్వరమ్మ, కిరణ్మయి, డాక్టర్ రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆడుదాం.. ఆంధ్రా పోటీలు ప్రారంభం

లింగాల : మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 15వ తేదీ నుంచి జనవరి 1వ తేదీవరకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16వ తేదీన కబడ్డీ, 18, 19వ తేదీలలో ఖోఖో, 20, 21వ తేదీలలో వాలీబాల్, 22, 23వ తేదీలలో బ్యాడ్మింటన్, 27, 28, 29వ తేదీలలో క్రికెట్, 30వ తేదీన టెన్నికాయిట్, ఇతర పోటీలు, జనవరి 1వ తేదీన బఫర్ డి పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలలో ఆయా కార్యాలయ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కమిటీ చైర్మన్లు, వలంటీర్లు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని శ్రీజ్ఞాన లింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పొరెడ్డి మహేశ్వరరెడ్డి, అయ్యప్పస్వామి కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని నాగలకట్టవీధిలోని శ్రీజ్ఞాన లింగేశ్వరస్వామి సన్నిధి నుంచి అయ్యప్పస్వామి గ్రామోత్సవం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. గ్రామోత్సవంలో బాల, బాలికలు, మహిళలు దీపోత్సవంలో పాల్గొనాలన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు దేవస్థానానికి చేరుకోవాలని తెలిపారు. 16వ తేదీ శనివారం ఉదయం 8.30 గంటలకు ఆలయం వద్ద లక్ష విభూది అర్చన, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

పేద ప్రజల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

పులివెందుల టౌన్ : పేద ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం స్థానిక చెన్నారెడ్డి కాలనీ సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తే అన్నివర్గాల ప్రజలకు మరిన్ని పథకాలు అందిస్తారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి గడపకు గడపకు మన ప్రభుత్వ పథక బ్రోచర్లను అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్లు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, ఆ వార్డు కౌన్సిలర్ షాహిదా, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్ అరుణమ్మ, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్

పెండ్లిమర్రి : మండలస్థాయిలో జరిగే జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో అర్జీదారులకు సంతృప్తి స్థాయిలో నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ జి.గణేష్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం పెండ్లిమర్రి మండల పరిషత్ సభాభవనంలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలు మండలస్థాయిలో స్థానికంగా పరిష్కారం కావాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. దీనిని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్నదన్నారు. ప్రజల నుంచి వినతులు మండలస్థాయిలోనే త్వరగా పరిష్కారం అయ్యేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

ప్రభుత్వం చేస్తున్న మేలును తెలియజేయాలి

కడప కార్పొరేషన్ : దళిత వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలును తెలియజేయాలని కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గంలోని దళిత నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళితులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయా వర్గాలకు ఇచ్చిన పదవులే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల దళితులకు ఎక్కువ మేలు జరిగిందన్నారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీలో ఉన్న దళిత నాయకులపై ఉందన్నారు. నియోజకవర్గంలో దళితులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యటించి ఈ మేరకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి. కిషోర్ కుమార్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దళిత నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడానికి యానిమేటర్లు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ తెలిపారు. పెండ్లిమర్రి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం వివోఏలకు నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘాలు బలోపేతం అయితే సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. బ్యాంక్‌ల్లో రుణాలు పొందిన సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందాలన్నారు. అనంతరం జగనన్న పాల వెల్లువ, ఏపీసీఎన్ఎఫ్, ఇంటర్నల్ లెండింగ్ వంటి ప్రాజెక్టులపై రివ్యూ నిర్వహించి వాటిలో పురోగతి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వరావు, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్ రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు ట్యాబ్‌ల పంపిణీ

పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకంలో భాగంగా వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి రీసర్వే చేసేందుకు ఉపయోగించే ట్యాబ్‌లను అందజేశారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు విజయవాడ సీడీఎంఏ కార్యాలయ జీఐఎస్ ఎక్స్‌పర్ట్స్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జగనన్న భూ హక్కు - భూ రక్ష పథకంలో భాగంగా ఇదివరకే డ్రోన్ ఫ్లై చేసి ఉన్నారని.. రీసర్వేలో ముఖ్యమైన పక్రియలైనటువంటి ఆర్క- జీఐఎస్, వెక్టరైజేషన్, ఎల్పీఎం, పీపీఎం తయారు చేయుటలో వార్డు అడ్మిన్, ప్లానింగ్ సెక్రటరీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి అజయ్‌కుమార్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథరెడ్డి, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.



వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు ట్యాబ్‌లను అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

వేంపల్లె : ఈనెల 15వ తేదీ నుంచి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగే 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వేంపల్లెలో అందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పీడీఎస్‌ఎస్ సంఘం 51 ఏళ్ల చరిత్రలో అనేక విద్యార్థి, యువజన సమస్యలతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి అనేక విజయాలు సాధించడం గొప్ప విషయమన్నారు. 23వ రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు, మేధావి వర్గాలు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, న్యాయవాదులు, వైద్యులు అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహా సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్ రమణారెడ్డి, తదితరులు